క్లుప్తంగా

నేడు ఒంగోలులో గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు సబర్బన్: నగరంలోని 32వ డివిజన్ గద్దలగుంటలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ఉదయం 7 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు బుధవారం ఆయన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గద్దలగుంట ఎక్స్‌టెన్షన్‌లోని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు కార్యాలయం ఎదురు రోడ్డు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయ సిబ్బందితో మేయర్ సమీక్ష

ఒంగోలు సబర్బన్: నగరంలోని చెరువుకొమ్ముపాలెం సచివాలయంలో సిబ్బందితో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం సమీక్షించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పలు ప్రధాన వీధుల్లో మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీతను కమిషనర్ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

ఫీడర్ చానల్ పనులను పరిశీలించిన పీడీ


కూలీలతో మాట్లాడుతున్న పీడీ శీనారెడ్డి

మద్దిపాడు: మండలంలోని పెదకొత్తపల్లి పంచాయతీ పరిధిలో నరసాయపాలెం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పీడీ శీనారెడ్డి బుధవారం ఉదయం ఆకస్మాతుగా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో మెడికల్ కిట్లు ఉన్నాయా.. లేదా అని పరిశీలించి మస్టర్లు తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిబంధనల ప్రకారం పనులు చేసి గరిష్టంగా రూ.272 కూలి పొందాలని తెలిపారు. గతంలో రూ.257 కూలి ఉండని, దానికి అదనంగా రూ.15 ప్రభుత్వం పెంచిందని చెప్పారు. అందువలన ఉపాధి కూలీలకు లబ్ధిచేకూరుతుందన్నారు. వేసవిలో ఎండ తీవ్రత పెరగకముందే ఉపాధి పనులు త్వరగా ముగించుకోవాలని కూలీలకు సూచించారు. నరసాయపాలెం పొలాల్లో ఫీల్డ్ చానల్ తవ్వకం పనులను పీడీ పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో ధనుంజయ, ఈసీ కిషోర్, టీఏ సోము, ఫీల్డ్ అసిస్టెంట్ రజని, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వేతనానికి తగిన పని చేయాలి

నాగులుప్పలపాడు: ఉపాధి పథకం ద్వారా కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన వేతనానికి సరిపడా కొలతలతో పని చేయాలని డ్వామా ఏపీడీ పి.వెంకటస్వామి సూచించారు. మండలంలోని తక్కెళ్లపాడు, కొత్తకోట, నిడమానూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కూలీలకు తగిన కొలతలతో రూ.272 వేతనంగా నిర్దేశించిందని, ఆ కూలికి తగిన పనిని కూలీలు తప్పకుండా ప్రతిరోజూ చేసుకోవాలని తెలిపారు. పనికి తగిన వేతనం అమలయ్యే విధానంలో రోజులో రెండు పూటలైనా పనిచేసుకోవచ్చన్నారు. తక్కువ పని చేసి వేతనం తగ్గితే ఆ కుటుంబం పని కోల్పోవడంతో పాటు వేతనం కూడా నష్టపోతుందన్నారు. ప్రతి కుటుంబం తప్పకుండా 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో ఛవిబాబు, టీఏలు, క్లస్టర్ ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తప్పిపోయి గంటలోనే తల్లిదండ్రుల చెంతకు



తల్లి చెంత చిరునవ్వులు చిందిస్తున్న బాలుడు

ఒంగోలు టౌన్: తప్పిపోయిన బాలుడిని గంటలోపే తలిదండ్రుల వద్దకు చేర్చారు ఒంగోలు పోలీసులు. వివరాల్లోకి వెళితే.. బేస్తవారిపేటకు చెందిన చావలి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం ఒంగోలులోని గాంధీరోడ్డులో షాపింగ్ చేస్తున్నారు. తల్లిదండ్రులు హడావుడిలో ఉండగా ఐదేళ్ల కుమారుడు తప్పిపోయాడు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో ఆందోళన చెంది వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, బ్లూకోట్స్, రక్షక్ సిబ్బంది వెదుకులాట ప్రారంభించారు. నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో తీవ్రంగా గాలించిన పోలీసులు.. గంటలోపే బాలుడి ఆచూకీ తెలుసుకొని తలిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసుల సహకారానికి బాలుడి తలిదండులు కృతజ్ఞతలు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ముస్లింలకు స్వయంగా వడ్డిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

అట్టహాసంగా బాలినేని ఇఫ్తార్ విందు

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఒంగోలులోని సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, బాలినేని ముస్లిం వస్త్రధారణలో పాల్గొని మాట్లాడారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు స్వయంగా బాలినేని వడ్డించారు. ముస్లింలకు ఎల్లప్పుడూ తన సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన అన్నారు.

– ఒంగోలు టౌన్



ముస్లిం వస్త్రధారణలో ముస్లిం యువతతో బాలినేని


ఇఫ్తార్ విందులో భారీగా పాల్గొన్న ముస్లింలు

తహసీల్దార్‌కు వీఆర్వోలు, సర్వేయర్ల ఫిర్యాదు

మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమానికి వెళ్తున్న వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు గైర్హాజరు నమోదు చేస్తున్నారంటూ తహసీల్దార్ జి.రజనీకుమారికి బుధవారం వారు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో రీ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఉదయమే వెళ్లి సర్వే పనులు నిర్వహించి అక్కడి నుంచి 11 గంటలకు సచివాలయానికి చేరుకుంటే వారికి ఆబ్సెంట్ వేయమని డీఏలు, సచివాలయ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఆన్‌లైన్‌లో హాజరు వేసినా కార్యాలయంలో 10.45 నిముషాల్లోపు హాజరు కావాలని, ఆ హాజరు పట్టీని ఫొటో తీసి తనకు పంపాలని ఎంపీడీవో చెప్పడాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రేషన్, మ్యుటేషన్, ఇతర ఫైల్స్ అన్నీ తహసీల్దార్ పరిధిలోకి వస్తాయని, కానీ, ఎంపీడీవో బీఎస్ఎల్ఏ గురించి మాట్లాడడం ఎంతవరకు కరక్ట్ అని వారు ప్రశ్నించారు. క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లకు సంబంధించి అర్జీ దాఖలు చేసిన వారిని విచారించి తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని, తదుపరి వారంలోపు వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వీఆర్వోలకు ఆదేశాలు ఉన్నాయని, ఆ విధంగానే తాము పనులు చేస్తున్నామని, కానీ, అర్జీలు పెండింగ్‌లో ఉంటే సదరు వీఆర్వో వివరణ తీసుకోవాలని కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించడం ఏంటని ఆందోళన చెందారు. వివరణ ఇవ్వని వారికి మెమోలు ఇవ్వాలని కూడా ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారని, అసలు సచివాలయ కార్యదర్శులకు మెమో జారీ చేసే అధికారం ఉందా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లు

సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం

గమళ్లపాలెం (కొత్తపట్నం): ఇన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పలువురు నాయకులు అన్నారు. మండలంలోని గమళ్లపాలెం, కొత్తపట్నం, మడనూరు గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలతో ఘనంగా స్వాగతం పలుకుతున్నారని నాయకులు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లుగా జరిగిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


గమళ్లపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొదుపుతోనే అభివృద్ధి

- డీఆర్‌డీఏ పీడీ బాబూరావు

ఒంగోలు రూరల్: పొదుపుతోనే అభివృద్ధి సాధ్యమని డీఆర్‌డీఏ పీడీ బాబూరావు అన్నారు. మండలంలోని చేజర్ల సచివాలయంలో గ్రామ సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటంలో మహిళలది కీలక పాత్ర అని, కుటుంబమైనా, సంఘమైనా, వ్యాపారమైనా మహిళల పాత్ర కీలకమైనదని అన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘ మహిళలను గుర్తించి రుణాలు మంజూరు చేస్తోందన్నారు. రుణం పొందిన మహిళలు తప్పనిసరిగా వ్యాపార ధోరణిలో కొనుగోలుదారుల నమ్మకం పొందేలా షాపులు ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధికై ప్రభుత్వం, డీఆర్‌డీఏ ద్వారా రుణాలు, రాయితీలు పొంది ప్రయోజనాలు పొందాలని పీడీ అన్నారు. ఎంపీపీ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, రుణమాఫీ కింద కేవలం ఒంగోలు మండలానికే రూ.21 కోట్లు మంజూరు చేశారన్నారు. సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ చేజర్ల గ్రామానికి రూ.81 లక్షలు రుణమాఫీ కింద మంజూరయ్యాయని, అందుకు కృషి చేసిన ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రుణమాఫీ పత్రాలను చేజర్ల గ్రామ డ్వాక్రా గ్రూపు మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, ఎల్‌సీ వెంకటసుబ్బయ్య, సీసీలు చెంచులక్ష్మి, రమణయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ బాబూరావు

దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈవోఆర్డీ బాలచెన్నయ్య

గుండమాల (కొత్తపట్నం): వేసవిలో దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు బాగా ఉపయోగపడతాయని ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య అన్నారు. మండలంలోని గుండమాల బస్టాండ్ సెంటర్‌లో సర్పంచ్ కారాని జయరావు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం రిబ్బన్ కట్ చేసి బాలచెన్నయ్య ప్రారంభించారు. చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికారిక సంస్థ, ఆంధ్రప్రదేశ్ నేచురల్ కమ్యూనిటీ ఫార్మింగ్ ఆధ్వర్యంలో 2023–24 ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళికపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సంఘస్థాయిలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. తొలిరోజు మహిళ సంఘ సభ్యులతో ర్యాలీ నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి కరపత్రాలు విడుదల చేశారు. ఏవో కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రీమూన్ డ్రై సోయింగ్ విధానం, ప్రకృతి వ్యవసాయ సామూహిక ఉపకరణాలు, 365 రోజులు ప్రకృతి వ్యవసాయ పెరటి తోటల గురించి వివరించారు. గ్రామంలోని రైతులందరిచే ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగేందుకు తగు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలపై గ్రామ స్థాయిలో, గ్రూపుస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. నేచురల్ ఫార్మింగ్ అధికారిణి రాధా శింగమనేని మాట్లాడుతూ రసాయనిక ఎరువుల ద్వారా, పురుగు మందుల ద్వారా పండించిన పంటలు ప్రస్తుతానికి తక్షణ ప్రభావం చూపకపోయిన భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, స్థానిక రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న ఏవో, ఏపీఎం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న దుంపా చెంచిరెడ్డి, మహిళలు

చీమకుర్తి: ప్రకృతి వ్యవసాయంపై మహిళా సంఘాలకు సంతనూతలపాడు వ్యవసాయ విస్తరణాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. సంతనూతలపాడు మండలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులతో పాటు ఇంటి పెరట్లలో ప్రకృతి వ్యవసాయం చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

దేవీవరప్రసాద్‌కు డాక్టరేట్

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ వ్యాయామ విద్య కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్‌కు బనస్థలి విద్యాపీఠం డాక్టరేట్ ప్రదానం చేసింది. బుధవారం రాజస్థాన్ గవర్నర్ కల్రాజ్ మిశ్రా చేతుల మీదుగా దేవీవరప్రసాద్ డాక్టరేట్ అందుకున్నారు. జాబ్ ఇండివిడ్యువల్ అండ్ ఆర్గనైజేషనల్ ఫ్యాక్టర్స్ ఇంపాక్ట్ ఆన్ స్ట్రెస్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ఆఫ్ సెకండరీ స్కూల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగానూ ఆయనకు డాక్టరేట్ లభించింది. వ్యాయామ వృత్తిలో ఉన్నటువంటి అధ్యాపకులు తమ జీవితంలో సరైన గుర్తింపు లేకపోవడం, సరైన పదోన్నతి లేకపోవడం, కుటుంబానికి, పిల్లలకు దూరంగా ఉండటం వల్ల మానసిక ఒత్తిడికి గురై మానసిక వికాసాన్ని పొందలేకపోవడం, తద్వారా శారీరక మానసిక అనారోగ్యానికి గురవడంపై తన పరిశోధనలో ఆయన వివరించారు. డాక్టరేట్ అందుకున్న దేవీవరప్రసాద్‌కు ఏకేయూ ఉపకులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, అధ్యాపక సిబ్బంది డాక్టర్ బాణానకృష్ణ, డీన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ సోమశేఖర తదితరులు అభినందనలు తెలిపారు.


డాక్టరేట్ అందుకుంటున్న దేవీవరప్రసాద్

లివర్ వ్యాధులపై అవగాహన అవసరం

ఒంగోలు అర్బన్: లివర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని ఏషియన్ ఆస్పత్రి డాక్టర్ మానస అన్నారు. ప్రపంచ లివర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సుందరయ్య భవన్ రోడ్డులో ఏషియన్ హాస్పిటల్, గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై డాక్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో ఏడాదికి దాదాపుగా పది లక్షల మంది లివర్ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. లివర్ వ్యాధిపై అవగాహన లేకపోవడం వలన వ్యాధి వస్తే ఏ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకోవాలో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. లివర్ వ్యాధి చికిత్సకు దక్షిణ భారతంలో ప్రఖ్యాతి గాంచిన క్లినికల్ గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై ప్రముఖంగా ఉందన్నారు. లివర్ 90 శాతం చెడిపోయే వరకు కూడా వ్యాధి లక్షణాలు కనిపించవన్నారు. అందువలన ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారి అయినా స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే ఎటువంటి ప్రమాదం, అత్యవసర పరిస్థితి లేకుండా బయటపడవచ్చన్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తగినంత ఆర్థికసహాయం అందిస్తున్నాయన్నారు. లివర్ వ్యాధులపై అవగాహన పెంచుకుని సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లివర్ చికిత్స నిపుణులు డాక్టర్ రజనీకాంత్, మానస, రాజశేఖర్, గ్లోబల్ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మానస

వైద్యశాలల్లో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: పెద్ద హాస్పిటళ్లలో అగ్ని ప్రమాదాలు సంభవించి రోగులు మంటల్లో చిక్కుకున్నప్పుడు వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడవచ్చని విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల జిల్లా అధికారి ఎస్.వేణుగోపాలరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక కిమ్స్ హాస్పిటల్లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రదర్శన ద్వారా పలు విషయాలను వివరించారు. విద్యుత్ పరికరాలను ఉపయోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒకవేళ గ్యాస్ సిలిండర్లు లీకైతే మంటలను ఎలా ఆర్పేయాలో చేసి చూపించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు అర్బన్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ గోడ పత్రికను డీపీఓ కార్యాలయంలో డీపీఓ నారాయణరెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. గ్రామ స్వరాజ్య సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ స్వరాజ్య సాధన సమితి అధ్యక్షుడు వీరభద్రాచారి, సర్పంచ్‌ల సంఘం నాయకులు పూనూరి సుబ్బారావు, ఎన్జీఓ నాయకులు రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన తహసీల్దార్


కొటార్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న చింతాయగారిపాలెం భూములను ఒంగోలు తహసీల్దార్ పి.మురళి బుధవారం పరిశీలించారు. స్పందన కార్యక్రమంలో వి.వెంకటేశ్వరమ్మ ఇచ్చిన అర్జీకి సంబంధించి భూముల పరిశీలన నిమిత్తం గ్రామానికి చేరుకున్నారు. అర్జీలోని అంశాలను పరిశీలించిన అనంతరం గ్రామంలోని ఉప్పు కొటార్లు సాగవుతున్న భూములను తహసీల్దార్ మురళి పరిశీలించారు. 449–ఏ ఎస్సీ కార్పొరేషన్ భూములను నిశితంగా పరిశీలించారు. కారంచేడు బాధితులకు పట్టాలిచ్చేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఉప్పు కొటారుల్లోని భూములు ఎవరు పేరు మీద ఉన్నాయి.. ఎంత సేద్యం చేస్తున్నారు, ఎవరు సేద్యం చేస్తున్నారు అనే వివరాలు సేకరించారు. కార్యక్రమంలో చింతాయగారిపాలెం సర్పంచ్ నాయుడు శ్రీరాములు, మండల సర్వేయర్ ఖాదర్ బాషా, చింతాయగారిపాలెం వీఆర్వో జగదీష్ బాబు, దేవరంపాడు వీఆర్వో శ్రీనివాసమూర్తి, గ్రామ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.